# ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

- పిడుగు శబ్దానికి వృద్ధురాలి మృతి
- గంగసముందర్‌లో ఇల్లు ధ్వంసం
- ఎల్లారెడ్డిలో ఇండ్లలోకి చేరిన నీరు

ఎల్లారెడ్డి/ లింగంపేట/ నవీపేట/ నందిపేట్, సెప్టెంబర్ 24: ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం రాత్రి, మంగళవారం భారీ వర్షం కురిసింది. నవీపేట మండలంలోని యంచ గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడిన శబ్దానికి గ్రామానికి చెందిన లక్ష్మీబాయి(61) మృతిచెందిందని స్థానికులు తెలిపారు. గ్రామంలో నాలుగు టీవీలు, ఏడు ఫ్యాన్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయాయన్నారు. డొంకేశ్వర్ మండలం గంగసముందర్ గ్రామంలో సోమవారం రాత్రి పిడుగుపడి అచ్చుగారి చిన్న భోజారెడ్డి ఇల్లు ధ్వంసమైంది. ఇంట్లోని ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి. స్లాబ్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోగా.. ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం పునరుద్ధరించారు.

ఎల్లారెడ్డి పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది.




పిడుగు శబ్దానికి మృతి చెందిన లక్ష్మీబాయి(ఫైల్)

బస్టాండ్ సమీపంలో ఉన్న బీసీ కాలనీలోని ఇండ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీరు వెళ్లడానికి దారి లేకపోవడంతో ఇండ్లలోకి చేరిందని, ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లింగంపేట మండలంలోని భవానీపేట గ్రామంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో వరి నేలకొరిగింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పంటను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎల్లారెడ్డిలో కురిసిన భారీ వర్షంతో ఇండ్లలోకి చేరిన వర్షపు నీరు



- కాంగ్రెస్ ఇస్తామన్న రైతు భరోసా కూడా రాలే..
- ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న రేవంత్
- సీజన్ ముగుస్తున్నా దక్కని 'రైతుబంధు'
- కేసీఆర్ ఇచ్చినట్లు రూ.12 వేలు కూడా ఇవ్వని ప్రభుత్వం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతాంగం

# రైతుబంధు ఎగవేత

వానకాలం పెట్టుబడి సాయం ఎగ్గొట్టిన సర్కారు

నిజామాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)
రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్.. రైతాంగానికి దారుణంగా వెన్నుపోటు పొడిచింది. సాగుకు ఊతమిస్తామని గద్దెనెక్కిన హస్తం పార్టీ.. అధికారంలోకి వచ్చాక రిక్త హస్తం చూపింది. ఎన్నికలకు ముందు కురిపించిన హామీల్లో ఏ ఒక్కదాన్నీ పూర్తిగా అమలు చేయలేక 'చేతు'లెత్తేసింది. రుణమాఫీ, రైతుబంధు, వడ్లకు బోనస్, పంటలకు మద్దతు ధర వంటి ముఖ్యమైన అంశాలను అటకెక్కించేసింది. కొందరికే రుణమాఫీ చేసిన సర్కారు.. వానకాలం రైతుబంధు ఇవ్వకుండా ఎగ్గొట్టింది. రూ.7500 చొప్పున పెట్టుబడి సాయం ఇస్తామని ఊదరగొట్టిన రేవంత్‌రెడ్డి.. గతంలో కేసీఆర్ ఇచ్చినట్లు రూ.5వేలు కూడా ఇవ్వకుండా రైతుల నెత్తిన శఠగోపం పెట్టారు. వాస్తవానికి జూన్ నెలలో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం వానకాలం ముగుస్తున్నప్పటికీ రైతుకు ఇవ్వకుండా మోసం చేశారు.




రైతుల వాట్సప్ గ్రూప్‌ల్లో వైరల్ అవుతున్న పోస్టు

## రైతులను ఆదుకునేందుకు..

అన్నదాతలను ఆర్థికంగా ఆదుకోవాలన్న సదుద్దేశంతో కేసీఆర్ రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. పంట పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించొద్దన్న లక్ష్యంతో ప్రభుత్వమే పెట్టుబడి సాయం అందించే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని 2018 మే 10న ప్రారంభించారు. తొలి విడుతలో నిజామాబాద్ జిల్లాలో 2.39 లక్షల మంది రైతులకు మేలు చేకూరింది. ఈ సంఖ్య కేసీఆర్ ప్రభుత్వం దిగి పోయే నాటికి 2.54 లక్షల మందికి చేరింది. కామారెడ్డి జిల్లాలో 2.42 లక్షల నుంచి ఏకంగా 2.71 లక్షలకు ఎగబాకింది. వీరందరికీ కేసీఆర్ ప్రభుత్వం ప్రతి సీజన్‌లో దాదాపు రూ.520 కోట్ల మేర పంపిణీ చేసింది.

## ఆగ్రహంలో రైతాంగం..

వరంగల్ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ రైతులపై వరాల వర్షం కురిపించింది. రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా కింద ఏడాదికి ఎకరాకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం, వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్, పంటలకు మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చింది. కానీ అమలులోకి వచ్చేసరికి మాత్రం అనేక షరతులతో రైతాంగాన్ని నిలువునా దగా చేసింది. రూ.2 లక్షల రుణమాఫీ పథకంలో అనేక ఆంక్షలు విధించడంతో చాలా మంది రైతులకు ప్రయోజనం దక్కకుండా పోయింది. దీనిపై ఇప్పటికే ఆగ్రహంగా ఉన్న రైతులు సర్కారుపై పోరు ప్రారంభించారు. ధర్నాలకు దిగిన ఆర్మూర్ ప్రాంత రైతులు.. సర్కారుపై సమరభేరి మోగించేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు, వానకాలం పెట్టుబడి సాయం ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. సన్నవడ్లకే రూ.500 బోనస్ ఇస్తామని మాట మార్చింది. ఈ నేపథ్యంలో అన్నదాతల్లో మరింత ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇక, రైతుల సంక్షేమమే ప్రాధాన్యంగా తొమ్మిదిన్నరేండ్లు పాలించిన బీఆర్ఎస్.. అన్నదాతలకు అండగా పోరాటాన్ని కొనసాగిస్తున్నది. కాంగ్రెస్ మోసాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ముఖ్య నేతలంతా ఎప్పటికప్పుడూ ఎండగడుతూనే ఉన్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో ధర్నాలు నిర్వహించిన గులాబీ శ్రేణులు.. రైతులకు మద్దతుగా మరిన్ని ఆందోళనలకు సమాయత్తమవుతున్నాయి.

## సాయానికి మంగళం..

కేసీఆర్ హయాంలో సాగు చేసే సమయానికే పెట్టుబడి అందించారు. ఎక్కడా జాప్యం లేకుండా పంట కాలం మొదలవుతుండగానే టింగ్‌టింగ్‌మంటూ రైతుల మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు వచ్చేవి. అయితే, రాష్ట్రం లో అధికారం మారిన తర్వాత పరిస్థితి కూడా మారిపోయింది. వానకాలం అందించాల్సిన పెట్టుబడి సాయాన్ని రేవంత్ సర్కారు ఎగ్గొట్టింది. రైతుబంధు కింద ఇచ్చే రూ.5 వేలను పెంచి రైతుభరోసా పేరిట రూ.7,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చాక గత యాసంగిలో రూ.7500 ఇవ్వాల్సి ఉండగా, రూ.5 వేల చొప్పున మాత్రమే రైతు ఖాతాల్లో జమ చేసింది. ఇక, వానకాలంలో రూపాయి కూడా ఇవ్వకుండా మొండి'చేయి' చూపింది. ఈ నెలాఖరుతో వానకాలం ముగియనున్నది. పంటలు కూడా కోత దశకు వచ్చాయి. కానీ ప్రభుత్వం మాత్రం రైతుభరోసా ఊసే ఎత్తడం లేదు. పెంచి ఇస్తామన్న సాయం దేవుడెరుగు.. కనీసం రూ.5 వేలు అయినా ఇవ్వాలని రైతాంగం కోరుతున్నది.

# కాటేయబోయిన నాగరాజు

## బాలికపై పీఈటీ అకృత్యం

- స్కూల్‌లో అత్యాచారయత్నానికి ఒడిగట్టిన వైనం
- ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు
- బడిలలోని వస్తువులను ధ్వంసం చేసిన బంధువులు
- అడ్డుకున్న పోలీసులపై రాళ్లదాడి
- లాఠీచార్జి చేసి చెదరగొట్టిన పోలీసులు
- కామారెడ్డి పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత
- నిందితుడి అరెస్టు, పోక్సో కేసు నమోదు



నిందితుడు నాగరాజు

కామారెడ్డి, సెప్టెంబర్ 24: కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జీవదాన్ పాఠశాలలో చదివే ఆరేండ్ల బాలికపై పీఈటీ నాగరాజు అత్యాచారయత్నం చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనతో మంగళవారం స్కూల్ ఎదుట తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ధర్నాకు దిగారు. ఈ క్రమంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీలు ఝుళిపించారు. అడిషనల్ కలెక్టర్, ఎస్పీ వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. కామారెడ్డిలోని జీవదాన్ పాఠశాలలో పీఈటీగా పనిచేసే నాగరాజు.. అదే స్కూల్‌లో చదివే ఆరేండ్ల బాలికపై అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. దీంతో భయపడిన బాలిక బడికి వెళ్లనని మారం చేసింది. ఏమైందని తల్లిదండ్రులు ఆరా తీయగా, బాలిక జరిగిన విషయం చెప్పింది. దీంతో నిర్ఘాంతపోయిన తల్లిదండ్రులు సోమవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికపై అఘాయిత్యం విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు మంగళవారం స్కూల్ ఎదుట ఆందోళనకు దిగాయి. మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ కూడా వచ్చి వారితో జత కలిశారు. ఈ విషయం తెలిసి బాలిక తల్లిదండ్రులు, బంధువులు పెద్ద సంఖ్యలో స్కూల్‌కు వచ్చి అక్కడున్న అద్దాలు, వస్తువులను ధ్వంసం చేశారు. ప్రిన్సిపాల్ చాంబర్‌లోకి దూసుకెళ్లేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఎంత చెప్పినా వినలేదు. అప్పటికే ఆగ్రహంతో ఉన్న ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు విసిరారు. సీఐ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఎస్సై రాజారాం, మరికొందరికి గాయాలయ్యాయి. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి అక్కడున్న వారిని చెదరగొట్టారు. పరిస్థితి చేయి దాటుతుండడంతో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి అక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడి శాంతింపజేశారు. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు పాఠశాల ఆవరణలో నాలుగు గంటలకు పైగా శాంతియుతంగా ఆందోళన చేశారు. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ సింధూశర్మ అక్కడకు చేరుకుని బాధితులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో మాట్లాడారు. పీఈటీ నాగరాజుపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేయగా, వారు అంగీకరించారు. నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలు, చైర్‌పర్సన్ ఇందుప్రియ



నిరసనకారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్, ఎస్పీ



స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న బాలిక బంధువులు (ఇన్‌సెట్‌లో) రాళ్ల దాడిలో గాయపడిన పోలీసును తీసుకెళ్తున్న తోటి సిబ్బంది